క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

కర్నూలు (న్యూసిటీ) : నా భూమి –నా దేశం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జెఎండీ.షఫీ మాట్లాడుతూ అందరం కలిసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామన్నారు.

అర్హులందరికీ ఉద్యోగాలివ్వాలి

కర్నూలు సిటీ: 98 డీఎస్సీలో క్వాలీఫై అయిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు ఇవ్వాలని అభ్యర్థులు శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.జి సృజనను కలెక్టరేట్‌లో కలిసి విన్నవించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 98 డీఎస్సీ బాధితులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 6, 682 మంది ఉండగా ఇప్పటి వరకు 4072 మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మిగిలిన వారికి కూడా ఇవ్వాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 324 మంది ఉన్నారని, వారందరికీ న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో శనివారం చేపట్టే నిర్వహణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు–1, 2, రూరల్స్ సబ్ డివిజన్ల పరిధిలోని 33 సబ్‌స్టేషన్లు, పవర్ హౌస్, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్ఏపీ క్యాంప్, రేడియో స్టేషన్, మామిదాలపాడు, సంతోష్‌నగర్, జొహరాపురం, శరీన్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, వార్త ఏరియా, సబ్‌స్టేషన్లు, 33, 11కేవీ ఫీడర్లు ఈ పనులు జరగనున్నాయని పేర్కొన్నారు. రూరల్స్ సబ్ డివిజన్‌లోని కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు మండలాల్లోని పనులు నిర్వహించనున్నామని, ఈ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అందించే కాలనీలు, గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఇద్దరు విద్యార్థులు డిబారైనట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,944 మందిగాను 4,304 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. డిబార్ అయిన విద్యార్థుల్లో డోన్ వైష్ణవి డిగ్రీ కళాశాలకు చెందిన ఒకరు, గూడూరు ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన మరొకరు ఉన్నారని వెల్లడించారు.

సెలవుల్లో కమిషనర్

కర్నూలు(టౌన్) : నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం నుంచి సెలవులకు వెళ్లారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 18వ తేదీ వరకు ఆయన సెలవులో ఉంటారని నగరపాలక కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామలింగేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఆయనను నియమించినట్లు తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

కర్నూలు(రూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ డా. సృజన అన్నారు. శుక్రవారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అట్యా – పాట్యా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో కేజీబీవీ ఓర్వకల్, ద్వితీయ స్థానంలో కేజీబీవీ పంచలింగాల, బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో చిన్మయ విద్యాలయ హై స్కూల్, ద్వితీయ స్థానంలో వీవీబీ హైస్కూల్ నిలిచాయి. గెలుపొందిన జట్లకు కలెక్టర్ సృజన బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో క్రీడా శాఖ సీఈఓ రమణ, అట్యా – పాట్యా సంఘం జిల్లా అధ్యక్షుడు కె. నాగరత్నమయ్య, కార్యదర్శి పవన్, వంశీకృష్ణ, భరత్, బాలాజీ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ల కూల్చివేత

కర్నూలు(టౌన్) : పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా వెలసిన పట్టణ వెంచర్లను శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. స్థానిక జొహరాపురం పరిధిలో మొత్తం 40 ఎకరాల్లో అక్రమంగా వెలసిన వెంచర్లపై చర్యలు చేపట్టారు. వెంచర్లలోని ఫెన్సింగ్‌లను, ప్రహరీ గోడలను, ప్లాట్ల నెంబర్ల కోసం వేసిన రాళ్లను పూర్తిగా తొలగించారు. భవన నిర్మాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని టౌన్ ప్లానింగ్ అధికారులు అన్నారు.



నిలబడి సాధించాలి: జిమ్నాస్టిక్ బ్యాలెన్సింగ్ చేస్తున్న కలెక్టర్ కుమారుడు విహాన్



విజయం మీ వెంటే: సర్టిఫికెట్లు, మెడల్ పొందిన క్రీడాకారులతో జిల్లా కలెక్టర్ జి.సృజన



లక్ష్యం బలంగా ఉండాలి: ఆర్చరీలో శిక్షణ



అడుగులు తడబడకూడదు: కుమారునితో స్కేటింగ్ చేయిస్తూ..

స్ఫూర్తినిస్తూ.. శిక్షణనిస్తూ!

పాలన వ్యవహారాల్లో రోజంతా తలమునకలై ఉండే జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం సాయంత్రం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి అట్యా–పాట్యా పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు జ్ఞాపికలు, మెడల్స్ అందజేయడంతో పాటు క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చేలా మాట కలిపారు. ఇదే సమయంలో కుమారుడు విహాన్‌కు గురువులా మారి జిమ్నాస్టిక్, స్కేటింగ్, ఆర్చరీ విభాగాల్లో మెలకువలు నేర్పుతూ తల్లి బాధ్యతను కూడా నెరవేర్చారు. వాకింగ్ చేస్తూ.. వాకర్లను పలకరిస్తూ క్రీడాకారులతో కలసి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతూ కలెక్టర్ అందరి దృష్టిని ఆకర్షించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకం

- యువతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వారిలో నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు
- చదువుతో పాటు ఉద్యోగార్హతకు శిక్షణ
- పాఠశాలలు, కళాశాలల్లో నిష్ణాతులచే ట్రైనింగ్
- నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

మన సమాజంలో చాలా మంది యువతీ యువకులు ఉన్నత చదువులు చదివి డిగ్రీ చేతబట్టుకుని బయటకు వస్తున్నారు. కానీ వారు ఈ పోటీ ప్రపంచంలో సరైన ఉద్యోగాలు సాధించలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం నైపుణ్యాలు లేకపోవడమే. వారిలో నైపుణ్యాలు పెంపొందించి ప్రతిభకు సానబట్టి ఉద్యోగ, ఉపాధి ద్వారా భవిష్యత్‌ను బంగారుబాట వేసుకునేందుకు జిల్లా యువజన సంక్షేమ శాఖ చర్యలు చేపడుతోంది. ఈ నెల 12వ తేదీన అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతకు జిల్లా యువజన సంక్షేమ శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచంలో అన్ని దేశాల కంటే మన దేశంలోనే యువత అధికంగా ఉంది. తద్వారా మానవ వనరులు అధికంగా ఉన్న దేశంగా గుర్తింపు పొందింది. కానీ చాలా మంది సరైన నైపుణ్యాలు లేక ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు సాధించలేక చతికిల పడుతున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. జిల్లా యువజన సంక్షేమ శాఖ ద్వారా అవసరమైన కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఒకవైపు విద్యార్థులకు చదువు కొనసాగిస్తూనే మరో వైపు వారికి కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లైఫ్‌స్కిల్స్, ఇంటర్వ్యూ, ఎగ్జామ్ ప్రిపరేషన్‌పై ఉచితంగా తరగతు లు నిర్వహిస్తోంది.ఇందుకోసం ట్యూటర్లు, కౌన్సిలర్లతో జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటి వరకు జిల్లాలోని మొత్తం 59 జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో 5,200 మందికి పైగా విద్యా ర్థినీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. దీంతో పాటు ఉన్నత చదువులు, వాటిని అందిస్తున్న విద్యాసంస్థలు, ప్రవేశపరీక్షలతో కూడిన వివరాలతో ఉన్న బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు.



నైపుణ్య అంశాలపై యువతకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



విద్యార్థినులకు బుక్‌లెట్ అందజేస్తున్న అధికారులు

యువజన సంక్షేమ శాఖ కార్యక్రమాలు

- జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ దినాలలో యువతకు ఆ రోజు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. ఈ మేరకు వివిధ అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను సంబంధిత శాఖలు, విద్యాసంస్థల సహకారంతో చేపడుతున్నారు.
- దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరు మీదుగా స్వాతంత్య్ర పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ భారత దేశ ఔనత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలు, ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని పౌరులందరికీ తెలియజెప్పే విధంగా కార్యక్రమాలను వివిధ శాఖలు, విద్యాసంస్థలు, యువజన, స్వచ్ఛంద సంఘాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు.
- 75 సంవత్సరాల స్వాతంత్య్ర ముగింపు వేడుకలను పురస్కరించుకుని మేరా మాటి–మేరా దేశ్–ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరు మీదుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు యువజన సంక్షేమ శాఖ అధికారులు ఈ నెలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.
- ఇండియన్ ఆర్మీ/ఎయిర్‌ఫోర్స్ మొదలైన రక్షణ దళాల్లో నిర్వహించే ఉద్యోగాల భర్తీ కార్యక్రమాల గురించి నిరుద్యోగ యువతకు సమాచారం తెలిసే విధంగా వివిధ సామాజిక, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ సహకారంతో వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామాలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్, మహిళల అక్రమ రవాణా అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచితంగా శిక్షణ



జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 59కి పైగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉచితంగా కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లైఫ్‌స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్,ఎగ్జామ్ ప్రిపరేషన్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఉన్నత చదువులు,ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూపించే ఎంతో విలువైన బుక్‌లెట్‌ను ఉచితంగా అందజేస్తున్నాము. ఇంకా ఏ ప్రభుత్వ విద్యాసంస్థలోనైనా ఇలాంటి తరగతులు కావాలంటే కల్లూరు ఎస్టేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలి.

–పీవీ రమణ, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి, కర్నూలు

యువతకు సరైన దిశా నిర్దేశం వస్తుంది



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా యువతకు దిశా నిర్దేశం లభిస్తోంది. చాలా మంది ఉన్నత చదువులు చదువుతున్నా ఎక్కడ ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి, వాటికి ఎలా సిద్ధం కావాలి, అందుకు ఎలాంటి నైపుణ్యాలు ఉండాలనే విషయాలు తెలియదు. ఇవి తెలియకే చాలా మంది చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవితాన్ని సాగదీస్తున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం అందించే కార్యక్రమం ఎంతో మంచిది. –ఎస్.రాజశేఖర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సిలర్, కర్నూలు

రాష్ట్రంలో పారదర్శక పాలన

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లేబర్ కాలనీ ఏరియాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి యజమానులకు సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. వారికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పథకాల అమలులో అవినీతి, అక్రమాలు అధికంగా ఉండేవన్నారు. నేడు దరఖాస్తు మొదలు పథకాల మంజూరు వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతుందన్నారు. ప్రభుత్వ సాయం సైతం నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, ఇర్ఫాన్, షేక్, సాధిక్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ఒకే చోట అన్ని రకాల వైద్యపరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే రోగులకు ఒకేచోట అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకట రంగారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం తన చాంబర్‌లో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమావేశమయ్యారు. ఏఏ విభాగానికి బ్లాక్‌లో ఎక్కడ కేటాయించాలనే విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్ వల్ల ఒకేచోట రక్తపరీక్షలు, సీటీస్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే తదితర పరీక్షలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆసుపత్రిలోని ఈ భవనం ద్వారా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. సమావేశంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రాధారాణి, డాక్టర్ రేణుక, డాక్టర్ పద్మ విజయశ్రీ, డాక్టర్ రమణబాబు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.

బిల్లుల వసూళ్లపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈఎం. ఉమాపతి అన్నారు. శుక్రవా రం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో బిల్లు లు రాబట్టాలని, నెలవారి బిల్లులు 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నా రు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకుని లక్ష్యం చేరాలన్నారు.

రుణ పంపిణీ వేగవంతం చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్‌వీ విజయమనోహరి

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాలకు అవసరమైన బడ్జెట్ కేటాయించి రుణ పంపిణీ వేగవంతం చేయాలని కేడీసీసీ చైర్‌పర్సన్ ఎస్‌వీ విజయమనోహరి అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక జోనల్ కార్యాలయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు,కార్యానిర్వాహణ అధికారులు, బ్రాంచిమేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వడ్డీ బకాయిలు 1.58 శాతంగా ఉన్నాయని ఈ ఆర్థిక సంవత్సరం 1 శాతం లోపు పరిమితం చేసే విధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, నాసర వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ, సీఈఓ రామాంజనేయులు, జీఎం శివలీల, డీఓ ఉమామహేశ్వరరెడ్డి, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, డీటీడీఎం నగిరాసుల్తాన్, డీసీఏఓ వెంకటక్రిష్ణ, పలు సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలు పాల్గొన్నారు.

పశుసంవర్ధక కార్యక్రమాలను రైతుల్లోకి తీసుకెళ్లండి

- పశుసంవర్ధకశాఖ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి లావణ్య లక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ చేపడుతున్న అన్ని కార్యక్రమాలను రైతుల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా స్పెషల్ ఆఫీసర్ లావణ్య లక్ష్మి తెలిపారు. పశు విజ్ఞానబడులను మరింత పకడ్బందీగా నిర్వహించడంపై వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు, ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ ఏడీలు మరింత దృష్టి పెట్టాలని సూచించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పశు సంవర్ధకశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై పర్యవేక్షించడంతో పాటు ఏమైనా గ్యాప్‌లు ఉంటే డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు డైరెక్టరేట్‌లో జేడీ స్థాయి అధికారి అయిన లావణ్యలక్ష్మిని ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. గురువారం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. శుక్రవారం వెటర్నరీ పాలీక్లినిక్‌లో పశువైద్యులు, ఏడీలతో నిర్వహించిన సమావేశంలో పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక అధికారి లావణ్యలక్ష్మి మాట్లాడుతూ పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ రామచంద్రయ్య, కర్నూలు, ఆదోని డీడీలు దుర్గాప్రసన్నబాబు, వెంకటరమణ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు పాల్గొన్నారు.

వైభవంగా పుష్ప యాగం

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్యం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓల్డ్ సిటీలోని ఉత్తరాధి మఠంలో శ్రీ సూక్త సమేత లక్ష్మీ హోమం, సామూహిక కుంకుమార్చన, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. టీటీడీ దాససాహిత్యం ప్రాజెక్ట్ విశేష అధికారి ఆనంద తీర్థ ఆధ్వర్యంలో పండితులు వేణుగోపాల్ ఆచార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో నగర మేయర్ బీవై రామయ్య, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఉత్తరాధి మఠం పండితులు విష్ణు తీర్థ ఆచార్, ఆర్‌జే పరిమళ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీ పూల బజార్‌లోని చిన్న అమ్మవారి శాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి 33 రకాల పిండి వంటలతో నైవేద్యం, 33 రకాల దీపాలతో హారతులు, 33 సంకీర్తనల అర్చన, మహా మగళ హారతి చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. యువపారిశ్రామిక వేత్త టీజీ భరత్ కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు : నగర శివారు డోన్ రోడ్డులోని గోశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చాకలి ఎల్లయ్య(32) మృతి చెందారు. ఎల్లయ్య కుల వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం రాగమయూరిలో బట్టలు ఉతికి ద్విచక్ర వాహనంపై కర్నూలుకు వస్తుండగా వేగంగా వచ్చి కారు ఢీకొట్టడంతో కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక కొద్దిసేపటికే మృతిచెందాడు. ఈయనకు భార్య మణితో పాటు కొడుకు, కూతురు సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..సంక్షేమ పథకాలు వివరిస్తూ

- 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ప్రజల నుంచి విశేష స్పందన
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు
- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య

కల్లూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధిలోని చంద్రశేఖర్ నగర్, వెంకటాద్రి నగర్, శ్రీవారి కుటీర్ కాలనీలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తెలియజయాలని కోరారు. కొందరు తమ కాలనీలో డ్రైనేజీలు, సీసీరోడ్లు, కల్వర్టులు నిర్మించాలని కోరగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే మునిసిపల్ అధికారులను ఆదేశించారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98శాతం అమలు చేశామన్నారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, అమ్మ ఒడి మొదలగు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆయా పథకాలను వినియోగించుకుని జీవనోపాధులను మెరుపర్చుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలను, ప్రభుత్వ సేవలను చేర్చుతున్నామనానరు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, అర్హతే ప్రామాణికంగా పథకాలను అందజేస్తున్నామన్నారు. వివిధ రూపాల్లో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మరోసారి పట్టం కటాలన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, విక్రమసింహారెడ్డి, కో–ఆప్షన్‌మెంబర్ కృష్ణమూర్తి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.